జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 11 | జులై | 2025 ◆ పేజీలు : 5

## రూ.4.50లక్షల గంజాయి పట్టివేత



**భద్రాచలం, జూలై 10, ప్రజాజ్యోతి :** వాహన తనిఖీల్లో 8.85 కిలోల గంజాయిని పట్టుకు న్నట్లు ఖమ్మం ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ సీహెచ్. శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని కూనవరం రోడ్ చెక్పోస్టు, ఆర్టీఏ కార్యాలయం వద్ద తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనాలు అనుమానాస్పదంగా

మిగతా 2 లో...

- ప్రైవేట్ పాఠశాలల తీరు
- నర్సరీ నుంచే పుస్తకాల మోత
- కమీషన్లకు ఆశపడి
- ఎక్కువ బుక్స్ అంటగడుతున్న వైనం
- కాగితాలకే పరిమితమైన సర్కార్ ఉత్తర్వులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- కలెక్టర్ దృష్టి సారించాలని కోరుతున్న తల్లిదండ్రులు



# బాల్యంపై... బ్యాగు బండ

2 లో..



ఈ ఫొటోలో కనిపిస్తున్నవారంతా భద్రాచలం లోని ఓ ప్రైవేట్ స్కూల్ 1వ తరగతి చదువుతున్న చిన్నారులు . వారి బ్యాగులో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, తదితర నోట్ బుక్స్.. మొత్తంగా 14 ఉన్నాయి. దీంతో 6కిలోల 62గ్రాముల బరువు ఉంది. ఈ బ్యాగును స్కూల్ వరకు తల్లిదండ్రులు తీసుకువచ్చినా.. స్కూల్ గేట్ నుంచి చిన్నారి మోయలేకపోతున్నారు . 'నా బిడ్డ బ్యాగ్ మోయలేకపోతోంది.. కొన్ని బుక్స్ స్కూల్లోనే పెట్టి.. హోం వర్క్, రీడింగ్ ఉన్న బుక్స్ మాత్రమే ఇంటికి పంపించండి' అని స్కూల్ యాజమాన్యానికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఓ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ప్రైవేటు పాఠశాలల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

◆ భద్రాచలం, ప్రజాజ్యోతి



### భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతంలో
## అరుదైన శస్త్ర చికిత్స

- నిరుపేద రాలికి భద్రాద్రి జిల్లాలో తొలిసారిగా లాప్రోస్కోపి ఆపరేషన్...
- పేద ప్రజల, ఉన్నత అధికారుల మన్ననలు పొందుతున్న ఏరియా హాస్పిటల్ వైద్యులు...

**భద్రాచలం టౌన్, జులై 10 (ప్రజాజ్యోతి):** భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలోఎక్కడ లేని విధంగా సూపర్డెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ పర్యవేక్షణలో డాక్టర్ వెంకట్ బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన పెరుమళ్ళ రమణ అనే మహిళకు గాల్ బ్లాడర్ స్టోన్స్ ఆపరేషన్ లాప్రోస్కోపిక్ పద్ధతులు విజయవంతంగా సక్సెస్ నిర్వహించారు. ఈ ఆపరేషన్ కోసం

మిగతా 2 లో...

### మారుమూల గ్రామాల్లో
## వైద్యసేవలపై దృష్టి సారించాలి

- వర్షాకాలం నేపథ్యంలో విస్తృత చర్యలు చేపట్టాలి
- వైద్యాధికారులతో ఐటీడీఏ పీవో రాహుల్ సమీక్ష



**భద్రాచలం, జూలై 10,ప్రజాజ్యోతి :** మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల్లో గిరిజనులు అనారోగ్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి వైద్యసేవలు అందించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం ఐటీడీఏలోని తన చాంబర్లో మెడికల్ ఆఫీసర్లు, సబ్ యూనిట్ అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పీవో మాట్లాడారు. ఏజెన్సీ ఏరియా పరిధిలో 113 హైరిస్క్ గ్రామాల్లో గిరిజనులకు శానిటేషన్

మిగతా 2 లో...

### విద్యార్థులకు భవిష్యత్తుకు వేదిక...
## మార్గదర్శకపు సమ్మేళనం

- తల్లిదండ్రులతో మమేకమైన సింగరేణి విద్యాసంస్థ అధికారులు..
- విద్యార్థుల భవిష్యత్ కు నూతన దిశా నిర్దేశం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 9, (ప్రజాజ్యోతి):** సింగరేణి విద్యాసంస్థలు విద్యార్థుల అఖండ అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకొని వినూత్న కార్యక్రమాలకి శ్రీకారం చుడుతున్నాయి. ఇందులో భాగంగా, బుధవారం సింగరేణి ఇంటర్ ఉమెన్స్ కాలేజీలో 'మార్గదర్శక సమ్మేళనం' పేరిట ఒక ప్రత్యేక

మిగతా 2 లో...

# రూ.4.50లక్షల గంజాయి పట్టివేత

(మొదటి పేజీ తరువాయి...)

కనిపించడంతో వాటిని ఆపి తనిఖీలు చేయగా 8.85 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి వారిని విచారించగా హైదరాబాద్ కు చెందిన ముడావత్ మోహన్‌నాయక్, గంటా పవన్‌కుమార్, రమావత్ గణేష్అయ్యప్పనాయక్, ఆకుల దర్శత్ చంద్రాలుగా ముఠాగా ఏర్పడి జల్సాలకు అలవాటు పడి గంజాయిని ఒడిస్సా నుంచి హైదరాబాద్ కు తరలించి హైదరాబాద్ లో విక్రయించి అధిక లాభాలు పొందాలని ఒరిస్సా వెళ్లి భద్రాచలం మీదుగా గంజాయిని హైదరాబాద్ కు తరలిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.4.50లక్షలు ఉంటుందని తెలిపారు. గంజాయితో పాటు రెండు ద్విచక్రవాహనాలు, మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో బాలు, సుధీర్, వెంకటేష్, హనుమంతరావు, వీరబాబు, ఉపేందర్ లు ఉన్నారు.

# భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతంలో అరుదైన శస్త్ర చికిత్స



(మొదటి పేజీ తరువాయి...)

పెరుమళ్ళ రవణ కుటుంబ సభ్యులు ఎన్నో రోజులుగా ఎంతో ఇబ్బంది పడుతూ ప్రైవేట్ ఆసుపత్రిని ఆశ్రయిస్తే సుమారుగా ఆపరేషన్ రెండు లక్షల ఖర్చు అవుతుందని చెప్పగా, వారి ఆర్థిక స్తోమత సరిపోక భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ ని సంప్రదించగా వెంటనే అయన స్పందించి ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఉచితంగా భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం లాప్రోస్కోపిక్ సర్జరీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాళ్ళ కుటుంబ సభ్యులు ఎంతో ఆనందంతో ప్రభుత్వ ఏరియా వైద్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# మారుమూల గ్రామాల్లో వైద్యసేవలపై దృష్టి సారించాలి

(మొదటి పేజీ తరువాయి...)

పరంగా ప్రత్యేక జాగ్రత్తలు వహించేలా ఏఎన్ఎం, ఆశావర్కర్లతో కోఆర్డినేషన్ చేసుకుని అవగాహన కల్పించాలని, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సకాలంలో వైద్యం అందేలా చూడాలని సూచించారు. ఏ గ్రామాల నుంచి అయితే మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధులు ఉన్నట్లు నిర్ధారణ అయిందో సంబంధిత వ్యాధిగ్రస్తులను పీహెచ్సీలకు తరలించి వైద్యపరీక్షలు చేసి మందులు అందించాలని, గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, అవసరమైతే ప్రజలందరికీ నిర్ధారణ పరీక్షలు చేయాలని ఈ విషయంలో పంచాయతీ సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. సిబ్బంది ఎవరైనా విధుల్లో అశ్రద్ధ వహిస్తే తనకు సమాచారం అందించాలని, గ్రామాల్లో గొత్తికోయలకు సైతం వైద్యసేవలు అందాలని సూచించారు. గోదావరి వరదలు కూడా పెరిగే అవకాశం ఉండటంతో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ముంపు గ్రామాలపై దృష్టిసారించాలన్నారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి వారిని సకాలంలో పీహెచ్సీలు, ఆసుపత్రులకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, పీహెచ్సీల్లో మందులు సరిపడా ఉండేలా చూసుకోవాలని, వర్షాకాలం సీజన్ నేపథ్యంలో అందరూ పీహెచ్సీల్లో అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, ఏడీఎంహెచ్వో చైతన్య, మలేరియా అధికారిణి స్పందన, వివిధ మండలాల మెడికల్ సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

# బాల్యంపై బ్యాగుబండ



**భద్రాచలం ,జూలై 10,ప్రజాజ్యోతి :** ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కాసులకు ఆశపడి పసి వయసులోనే విద్యార్థులకు భారం వేస్తున్నారు. విద్యార్థుల బ్యాగు భారంగా.. తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారుస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమా న్యాలు పదుల సంఖ్యలో పుస్తకాలు అంటగట్టి సొమ్ముచేసుకుంటున్నారు. తరగతులు పెరిగేకొద్దీ విద్యార్థుల బ్యాగు బరువు సైతం పెరుగుతోంది. దీంతో పుస్తకాల బరువు మోయలేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ప్రైవేట్ పబ్లికేషన్ పుస్తకాలను అంటగడుతున్నా జిల్లా విద్యాశాఖ పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక దృ ష్టి సారించి దోపిడీని కట్టడి చేయాలని కలెక్టరు కోరుతున్నారు.




### అమలుకాని ఉత్తర్వులు

విద్యార్థుల వీపుపై బండెడు బరువును తగ్గించటానికి 18, జూలై 2017న ప్రభుత్వం 22 జీవోను జారీ చేసింది. ఎన్సీఆర్టీ ప్రకారం ప్రభుత్వం జారీ చేసిన పుస్తకాలే ప్రైవేటు పాఠశాలలో వినియోగించాలి. ఇష్టం వచ్చి నట్లు ప్రైవేట్ బుక్స్ పబ్లికేషన్ పుస్తకాలను వినియోగించవద్దని పేర్కొంది. జిల్లా విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల్లో జీవో అమలుకు నోచు కోవడం లేదు. దీంతో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ఇష్టారీతిన విద్యార్థులపై భారం మోపుతున్నారు. పిల్లల శరీర బరువులో బ్యాగు బరువు 10 శాతం కంటే ఎక్కువ ఉండవద్దని విద్యావేత్తలు అనేక మార్లు సూచించారు.

### ఎదుగుదలపై ప్రభావం

చిన్నారులు స్కూల్ బ్యాగు అధికంగా మోస్తుండ టంతో వారి శారీరక ఎదుగుదల పై ప్రభావం పడుతోంది. గతంలో ఆరు సబ్జెక్ట్ కు ఆరు నోట్ బుక్ తో పాటు రఫ్ నోట్ మాత్రమే ఉండేది. ఇప్పుడు సబ్జెక్ట్, ఒక నోట్ బుక్తో పాటు డైరీ, గైడ్లు, డ్రాయింగ్ బుక్స్, ఇతర బుక్లను కలుపుకుని 6 నుంచి 12కిలోలు బరువు ఉంటోంది. చిన్నారుల భుజాలపై మోసుకుంటూ ఒకటి, రెం డు, మూడు అంతస్తుల భవనాల్లో ఉన్న తరగతి గదులకు వెళ్తున్నారు. దీంతో పిల్లలకు వెన్నునొప్పి, జాయింట్ పెయిన్ బారీన పడుతు న్నారు. ఇలానే చిన్నారులు అధిక బరువు భూజా లపై పడితే భవిష్యత్తులో నాడీ వ్యవస్థపై ఎక్కువ ప్రభావం పడే అవకాశాలున్నాయి.

**జీఓ ప్రకారం ఇలా ఉండాలి**

**1, 2వ తరగతి వరకు 1.5 కిలోలు**

**3–5 వరకు 2–3 కిలోలు**

**6–8 నుండి 3–4 కిలోలు**

**9–10 తరగతులు 5 కిలోలు**

### కలెక్టర్ దృష్టి పెట్టాలి

ప్రైవేట్ స్కూల్స్, ప్రైవేట్ బుక్స్ పబ్లికేషన్స్, బుక్ స్టాళ్ల యాజమాన్యాలు కాసుల కక్కుర్తితో విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై భారం మోపుతున్నారు. అధికారులు కుమ్మక్కై తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు విన వస్తున్నాయి. ఈవిషయంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ప్రైవేట్ ఆగడాలను అరికట్టలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## విద్యార్థులకు భవిష్యత్తుకు వేదిక...

# మార్గదర్శకపు సమ్మేళనం



(మొదటి పేజీ తరువాయి...)

కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొదటి సంవత్సరం విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి, వారితో మమేకమయ్యారు. కాలేజీ నిర్వహణ, విద్యా ప్రమాణాలు, హాస్టల్ వసతి, విద్యార్థుల భవిష్యత్ దిశగా చేపడుతున్న కార్యక్రమాలపై విపులంగా వివరించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వాహకులు మాట్లాడుతూ..., "కేవలం ఇంటర్ విద్యతోనే పరిమితం కాకుండా, సీపీటీ, ఎంసెట్, నిట్, జేఈఈ వంటి పోటీ పరీక్షల కోర్సులు కూడా మొదటి నుండే అందిస్తున్నామని, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా నాణ్యమైన కోచింగ్ తోపాటు విలువాధారిత విద్యను అందించడమే మా లక్ష్యం," అని పేర్కొన్నారు. విద్యార్థులకు మార్గదర్శకత అందించడమే కాకుండా, తల్లిదండ్రులకు కూడా విద్యాసంస్థలపై నమ్మకం



కలిగించేలా ఈ సమావేశం రూపకల్పన చేసిన తీరు ప్రశంసనీయమని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఈ సమ్మేళనం విద్యార్థులకు మార్గదర్శకతతోపాటు, తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని నింపింది. భవిష్యత్తు విజయాల పునాది ఏవిధంగా వేయాలో చక్కగా చాటిచెప్పిన ఈ కార్యక్రమం, సింగరేణి విద్యాసంస్థల వైవిధ్యాన్ని, దృఢ సంకల్పాన్ని ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో సింగరేణి విద్య



సంస్థ సెక్రటరీ గుండా. శ్రీనివాస్,



జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ హలవత్. వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ కిరణ్ కుమార్, కాలేజ్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి తోపాటు పలువురు అధ్యాపకులు, వ్యక్తి వికాస నిపుణులు పాల్గొన్నారు.

# ఎసీటీ ఉపాధ్యాయులకు ఉద్దీపకం వర్క్ బుక్స్-2పై శిక్షణ

▪ ఐటీడీఏ పీవో రాహుల్






**భద్రాచలం, జూలై 10,ప్రజాజ్యోతి :** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, జీపీఎస్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల గుణాత్మక విద్యను పెంపొందించేందుకు కనీస సామర్థ్యాలను విద్యార్థుల్లో మెరుగుపరిచేందుకు ఉద్దీపకం వర్క్ బుక్స్ రూపొందించి అమలుచేయడం జరుగుతుందని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. గురువారం భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో ఏహెచ్ఎస్, ఏపీఎస్, జీపీఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు ఉద్దీపకం వర్క్ ్బుక్స్-2పై ఇంగ్లీష్ మీడియంలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్లలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడంతో విద్యార్థుల కనీస సామర్థ్యాలు పెంచేందుకు అర్థమయ్యే రీతిలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో సలహాలు, సూచనలు తీసుకుని ఈ ఉద్దీపకం వర్క్ బుక్స్ రూపొందించామని, దీనివల్ల మూడు, నాలుగు, ఐదు తరగతుల పిల్లలకు గుణాకారాలు, భాగాహారాలు, పిల్లల విద్యపరంగా నైపుణ్యాలు కొంతవరకు పిల్లలు అర్థం చేసుకుని సొంతంగా చదవడం, రాయడం, పాఠ్యాంశాలు చెప్పడం జరుగుతుందన్నారు. ఉద్దీపకం వర్క్ ్బుక్స్-2లో సారాంశాలను పిల్లలకు అర్థమయ్యేలా బోధించేందుకు ఎస్జీటీలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం బీఈడీ, డీఎడ్ కళాశాలల గదులను పరిశీలించి రిపేర్లు ఉంటే ప్రతిపాదనలు పంపాలని ట్రైబల్ ఈఈ హరీష్ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరునాయక్, ఏసీఎంవోలు రమేష్, శ్రీరాములు, ఏటీడీవోలు అశోక్కుమార్, రాధమ్మ, సీఆర్పీలు వరబాబు, శంకర్, మోతీలాల్, జీసీడీవో అలివేలు, మంగతాయారు, ఏపీఎస్, జీపీఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో అన్నదానం



**భద్రాచలం టౌన్, జులై 10 (ప్రజాజ్యోతి):** గురువారం రోజున గురు పౌర్ణమి పురస్కరించుకొని స్థానిక డిగ్రీ కాలేజ్, పాత మార్కెట్ సెంటర్లో టీఎన్జీవోస్ ప్రెసిడెంట్ డెక్క నరసింహారావు సెక్రటరీ గగ్గూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో నిరుపేదలకు యాచకులకు ఉచితంగా అన్న ప్రసాదం అందజేశారు. వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుంచి ప్రతి గురు పౌర్ణమి రోజు అన్న పంపిణీ కార్యక్రమం తోటి ఉద్యోగుల సహకారం తో భద్రాచలం నందు నిర్వహించటం చాలా సంతోషంగా ఉన్నదని తెలుపుతూ, సహకరించిన తోటి ఉద్యోగులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగ సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, విజయ కుమారి తో పాటుగా రాము, ప్రమోద్ బ్రహ్మారావు తదితర ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షూ,సాక్సులు అందజేత



**బూర్గంపహాడ్,జూలై 10(ప్రజా జ్యోతి) :** బూర్గంపహాడ్ మండలం అంజనాపురం ఎంపీపీఎస్ పాఠశాలలోని 65 మంది విద్యార్థిని విద్యార్థులకు ఎన్నారై తేజావత్ జానకి రామ్ సుమారు రూ.15000 విలువగల పాదరక్షకులు (షూస్),సాక్సులను గురువారం వితరణగా అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ యదు సింహరాజు పాల్గొని మాట్లాడుతూ.. జిల్లాలోనే అంజనాపురం ఎంపీపీఎస్ ఉత్తమ పాఠశాలగా పేరుందని అన్నారు.జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి నుంచి ఉత్తమ ప్రశంసలు అందుకున్న పాఠశాల అని అలాంటి పాఠశాలకు సహాయం అందించడం మరువలేనిది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం టి.కిషన్ రావు, ఉపాధ్యాయులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం కల్చరల్ , జూలై 10,ప్రజాజ్యోతి :** భద్రాచలం దివ్య క్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యబలిహరణం, నిత్యహోమాలు, నిత్యపూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



**బూర్గంపహాడ్, జూలై 10 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రమైన బూర్గంపహాడ్, మండల పరిధిలోని సారపాకల్లో సాయి బాబాకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్నగర్లో కొలువైన సాయిబాబాకు అర్చకులు స్వామివారికి ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, సాయిచాలీసా, హనుమాన్ చాలీసా, బంగా రు పుష్పాలతో గురుపాదుకలకు అర్చన, పంచామృతాలతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం మహాన్నదానం ఏర్పాటు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో అన్నదానంలో పాల్గొన్నారు.

## దమ్మక్క సేవాయాత్రలో విస్మరించారంటూ ఆదివాసీల నిరసన



**భద్రాచలం, జూలై 10,ప్రజాజ్యోతి :** ప్రతి ఏటా ఆషాఢ పూర్ణిమ నాడు భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అపర శబరి పోకల దమ్మక్క సేవాయాత్ర నిర్వహిస్తారు. గత 11 ఏళ్లుగా దమ్మక్క ఆదివాసీ మహిళ కావడంతో సేవాయాత్రకు ఆదివాసీ సంఘాలను ఆహ్వానించి వారి సమక్షంలో దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా కార్యక్రమాన్ని నిర్వహించేవారు. అయితే గత ఏడాది నుంచి దమ్మక్క సేవాయాత్రను రామాలయంతో పాటు ములుగుజిల్లా వెంకటాపురంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్నారు. దమ్మక్క సేవాయాత్రకు ఆదివాసీ సంఘాలను ఆహ్వానించే రామాలయం అధికారులు ఈ ఏడాది ఆహ్వానించకపోవడంతో గురువారం ఉదయం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో హరిత హోటల్ సమీపంలోని దమ్మక్క విగ్రహానికి పూలమాల వేసి ఫలపుష్పార్చన నిర్వహించారు. ఆ తర్వాత రామాలయం అధికారులు దమ్మక్క విగ్రహం వద్దకు చేరుకోవడంతో ఆదివాసీ సంఘాల నాయకులు కృష్ణదొర, వీరభద్రం రామాలయం అధికారులను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది.

## బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు





**లక్ష్మీదేవిపల్లి, జులై 10, ప్రజాజ్యోతి:** లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలో లక్ష్మీదేవి పల్లి బిజెపి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించినారు ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ దేశంలో గురువుల పాత్ర ఎంతగానో ఉందని గురువు లేనిదే ఏ రంగంలోనైనా పురోగతి ఉండదని గురువే సృష్టికి మూలధారమని ఆయన అన్నారు అనంతరం ఉపాధ్యాయులకు, డాక్టర్లకు, యోగ గురువులను సత్కరించారు ఈ కార్యక్రమంలోప్రిన్సిపల్ పోలారపు. పద్మ , వైస్ ప్రిన్సిపల్ పూర్ణ చందర్ రావు , డాక్టర్ వెంకన్న, విద్యా ప్రవీణ, ఎ. వెంకటేశ్వర్లు, పి. సుస్మిత, జి. మధు, ఎస్. సునీత, వి. అంజనీ దేవి, యన్. అనిత, వెంకట రమణ, అరుణ, శ్రీలత, బాలు లక్ష్మీనారాయణ, జ్యోతి మరియు ప్రముఖ యోగ గురువులు గుమలాపురం. సత్యనారాయణ , పిల్లలమర్రి. వర ప్రసాద్ బిజెపి నాయకులు. నవీన్ కుమార్. శివాజీ. కవిత. ధనలక్ష్మి. వెంకన్న. అరుణ. కళావతి. రఘు. నరసింహ తదితరులు పాల్గొన్నారు

## ఏజెన్సీ సివిల్ మొబైల్ కోర్టుకు శాశ్వత ప్రాతి పదికన న్యాయమూర్తి ని నియమించాలి

▪ భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోట దేవదానం



**భద్రాచలం ,జూలై 10,ప్రజాజ్యోతి :** ఏజెన్సీ సివిల్ మొబైల్ కోర్టుకు శాశ్వత ప్రాతి పదికన న్యాయమూర్తి ని నియమించాలని భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోట దేవదానం అన్నారు .గురువారం బార్ అసోసియేషన్ కార్య నిర్వాహక కమిటీ సమావేశంలో కోట దేవదానం మాట్లాడుతూ 28 మండలాలలో సివిల్ కేసుల పరిష్కారానికి ఏర్పరిచిన, మొబైల్ కోర్టుకు శాశ్వత ప్రాతి పదికన మెజిస్ట్రేట్ నియామకాన్ని సత్వరమే చేబట్టి, బడ్జెట్ మంజూరు చేయాలని, గత సంవత్సరం గా ఖాళీగా ఉన్న అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పోస్ట్ ను భర్తీ చేయాలని దాదాపుగా 100 సంవత్సరాలుగా 5000 ఆర్థిక పరిధిగా వున దావాలా విలువ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ తో సమానంగా రూ. 20,00,00/- పరిధికి పెంచాలని డిమాండ్ చేసారు .ప్రారంభ కాలం నుంచి భర్తీ చేయని అదనపు జుడిషియల్ మెజిస్ట్రేట్ పోస్టును భర్తీ చేయాలని అన్నారు ,ఈ ప్రతిపాదనను ఉపాధ్యక్షులు సున్నం రమేష్, ప్రధాన కార్యదర్శి పూసల శ్రీనివాస చారి, సంయుక్త కార్యదర్శి, శ్రీమతి బాసం శారద రెడ్డి, కోశాధికారి పేరాల నాగరాజు, గ్రంథాలయ కార్యదర్శి చందా హనుమంత్ రావు, మహిళ న్యాయవాద ప్రతినిధి పులుసు తరుణి, కార్యవర్గ సభ్యులు కె శ్రీమన్నారాయణ, దన్నాన రాము, అరుణశ్రీ, ఎంవి రమ, సాధనపల్లి సతీష్, సింగం శ్రీధర్, ధనసిరి నరసింహమూర్తి, ఎం సంధ్యారాణి ,భాస్కర్ రావు పాల్గొని తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

## నిలకడగా గోదావరి ప్రవాహం



**భద్రాచలం, జూలై 10,ప్రజాజ్యోతి :** భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం నిలకడగా సాగుతోంది. బుధవారం రాత్రి 24.10 అడుగులకు గోదావరి చేరుకుని గురువారం ఉదయం 7 గంటలకు క్రమం తగ్గి 23.10 అడుగులకు చేరుకుంది. సాయంత్రం 3 గంటలకు క్రమంగా వరద పెరిగి 24.10 అడుగులకు చేరుకుని ప్రస్తుతం నిలకడగా ప్రవహిస్తోంది. కాళేశ్వరం నుంచి 6లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా శుక్రవారం నాటికి ఆ వరద ఇక్కడకు చేరుకుని వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు చెబుతున్నారు.

## గంజాయి పట్టివేత



**టేకులపల్లి, జులై 10, ప్రజా జ్యోతి:** అక్రమంగా గంజాయి తరలిస్తున్న యువకుడుని అరెస్టు చేసిన ఘటన టేకులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం గురువారం టేకులపల్లి ఎస్సై ఎ.రాజేందర్ అతని సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానం వచ్చి టిఎస్ 29టి 6104 నెంబర్ గల ఆటో ను ఆపి తనిఖీ చేయగా అందులో రెండు తెల్లని సంచులలో 4.130కెజిల గంజాయి ఉన్నట్టు గుర్తించి ఆటో డ్రైవర్ దుంప ప్రసాద్ ను అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి ని నల్లగొండ కు తీసుకొని వెళ్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆటోను సీజ్ చేసి పట్టుబడిన వ్యక్తి దుంప ప్రసాద్ పై కేసు నమోదు చేసినట్టు సీఐ తాటిపాముల సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అలకుంట రాజేందర్, సిబ్బంది భాస్కర్, హుస్సేన్, నవీన్, సాగర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షులు ఇల్లందు నియోజకవర్గం అధ్యక్షుని పరామర్శ



**టేకులపల్లి,జూలై10,ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇల్లందు నియోజకవర్గం మాలోత్ రాజేందర్ ను గురువారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలైనటువంటి ఇల్లందు నియోజకవర్గ జాగృతి అధ్యక్షులు మాలోత్ రాజేందర్ ను తెలంగాణ రాష్ట్ర జాగృతి వ్యవస్థాప అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్తగూడెం పర్యటనలో భాగంగా హేమచంద్రపురంలోనే మాలోత్ రాజేందర్ నివాసంలో రాజేందర్ ని పరామర్శించి, కుటుంబానికి నేనున్నానని మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాగృతి పార్టీ నాయకులకు కార్యకర్తలకు వెన్నంటే ఉంటానని, సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని, తప్పులు తప్పు అని చూపించాలని, ప్రభుత్వమైన, బిఆర్ఎస్ పార్టీ నాయకులైన సామాన్య ప్రజానీకానికి ఎవరికైనా అన్యాయం చేస్తే జాగృతి పార్టీ నాయకులు దాన్ని వేలెత్తి చూపించాలని వారికి న్యాయం జరిగేలా చేయాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్,టిఆర్ఎస్ నాయకులు సీమల సత్యనారాయణ,పద్మావత్ శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా దమ్మక్కసేవాయాత్ర





- వెంకటాపురంలో రామయ్యకు కల్యాణం

**భద్రాచలం కల్చరల్ , జూలై 10,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు ములుగు జిల్లాలోని వెంకటాపురం గ్రామంలో రామయ్యకు మొదటి పూజలు చేసిన దమ్మక్క సేవా యాత్ర, శ్రీసీతారామచంద్రస్వామికి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. తొలుత భద్రాచలంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా దమ్మక్క సేవ ఉత్సవం సందర్భంగా అర్చకులు పూజలు చేశారు. భక్తరామదాసు ఆలయం నిర్మించకముందు దమ్మక్క రామయ్యకు మొదటి పూజలు చేశారని, ఆమెకు గుర్తుగా ప్రతి ఏడాది దమ్మక్కను స్మరించుకుంటూ ఆషాఢపౌర్ణమి నాడు సేవాయాత్ర నిర్వహించి ఆమె విగ్రహానికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందని అర్చకులు తెలిపారు. అనంతరం వ్యాసమహర్షి విగ్రహానికి కూడా పూజలు చేసి దమ్మ చిత్రపటంతో ఆలయ గిరి ప్రదక్షిణ నిర్వహించారు.

### ములుగుజిల్లా వెంకటాపురంలో....

ములుగుజిల్లా వెంకటాపురం గ్రామంలో దమ్మక్క సేవాయాత్రను గిరిజనుల సమక్షంలో ఆదివాసీల కొమ్ము నృత్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. ములుగు జిల్లాలోని వెంకటాపురంలో జరిగే దమ్మక్క సేవాయాత్రలో భాగంగా అక్కడి దమ్మక్క, రాములోకి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమ్మునృత్యాల నడుమ గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో రాములోరికి వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకలో గిరిజనులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి వారి చేతులమీదుగా పూజా సామాగ్రి, పూలు, పండ్లతో కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు గిరిజన ఆదివాసీ పెద్దలు, మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఐదు పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలి

- ఏపీ సీఎం చంద్రబాబుకు కవిత బహిరంగ లేఖ



**భద్రాచలం, జూలై 10, ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణంలో అంతర్భాగంగా, పట్టణాన్ని ఆనుకుని ఉన్న ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆంధ్రపదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు గురువారం బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విడిపోయాక తర్వాత పోలవరం ముంపు పేరుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను చీకటి ఆర్డినెన్స్ ద్వారా ఏపీలో విలీనం చేయించుకున్నారని పేర్కొన్నారు. 2014లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న మీరు పట్టుబట్టి ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసుకున్నారని, తద్వారా లోయర్ సీలేరు పవర్లంట్ను లాగేసుకుని తెలంగాణలో కరెంట్ కష్టాలకూ కారకులయ్యారని, పోలవరం పేరుతో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని ముంచేసే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఏడు మండలాలను ఏకపక్షంగా విలీనం చేసుకోవడంతో భద్రాచలం పట్టణంలో అంతర్భాగంగా ఉన్న, పట్టణాన్ని ఆనుకుని ఉన్న ఎటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. భద్రాచలం రాముని ఆలయ మాన్యం భూములు పురుషోత్తపట్నం రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్నాయని, రాములోరు తెలంగాణలో ఉంటే ఆయన మాన్యం భూములు ఏపీలో ఉండటంతో ఆ భూముల్లో ఇష్టారాజ్యంగా కబ్జాలు కొనసాగుతున్నాయని, కబ్జాలను అడ్డుకునే ప్రయత్నం చేసిన భద్రాచలం ఆలయ ఈవో రమాదేవిపై కబ్జాదారులు దాడిచేసిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, రాముడి పేరు చెప్పి కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలో మీరు భాగస్వామిగా ఉండి అదే రాముడు కొలువై ఉన్న భద్రాచలం పట్టణాన్ని పోలవరంలో ముంచేసే కుట్రలు చేస్తున్నారని ఆ లేఖలో సంచలనంగా పేర్కొన్నారు. ఎటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామాలు ఏపీలో అంతర్భాగంగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్య, వైద్యం ఇతర సేవలు పొందడానికి, ఉపాధి అందిపుచ్చుకోవడానికి వందల కిలోమీటర్లు దూరం వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఆ ఐదు గ్రామాల ప్రజల సమస్యలను చూసి చలించిపోని వారు మానవతావాదులే కారనే విషయాన్ని గుర్తించాలని, ప్రజల ఇబ్బందులు పరిష్కరించడంతో పాటు భద్రాచలం రామయ్య భూముల పరిరక్షణ కోసం వెంటనే ఆ ఐదు పంచాయతీలైన ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని ఆ లేఖలో కవిత విజ్ఞప్తి చేశారు.

## ఇల్లందు ఆర్యవైశ్యులకు అత్యంత ఆప్తులు వాసవి క్లబ్ సేవకులు

- పదవి, సంఘం ఏదైనా ఆయన మార్గమే సేవా మార్గమే
- ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన యోధుడు
- గురు పౌర్ణమి రోజున ఆదర్శ గురువుకు ఘన సత్కారం



**ఇల్లందు, జులై 10, ప్రజాజ్యోతి :** ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం ఆయన నిరాడంబరతకి నిదర్శనం.. అటు మార్గదర్శిని స్కూల్ లో పిల్లలకు పాఠాలు చెబుతూనే ఇటు వాసవి క్లబ్ ను పరుగెత్తిస్తున్న ఘనుడే అర్వపల్లి రాధాకృష్ణ (ఆర్కే). ఎందరో విద్యార్థులకు విద్యాబోధన చేసి గొప్ప గొప్ప వృత్తులలో స్థిరపడేలా తీర్చిదిద్దిన మహనీయుడు. వాసవి క్లబ్ ద్వారా సేవ చేయడమే కాకుండా వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. నిత్యం వ్యాపార వృత్తులలో బిజీగా ఉండే ఆర్యవైశ్యులు, యువకులను సైతం సేవ మార్గంలో ఎలా నడపాలనే తాపత్రయం ఆయన సొంతం. అందులో భాగంగానే ఈ 2025 సంవత్సరం వాసవి క్లబ్ కు నూతన రక్తం అందివ్వాలని ఇల్లందుకు ముగ్గురు కొత్త వ్యక్తులను పరిచయం చేయడం జరిగింది. వాసవి క్లబ్ సేవ కార్యక్రమాలకు ఆయన ప్రోత్సాహం, పట్టుదల అంత ఇంత కాదనే చెప్పొచ్చు. ప్రతి కార్యక్రమంలో ఆయనే ముందు వరుసలో నిలబడతారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆయన చూపిన మార్గంలో కొత్త కుర్రోళ్ళు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ లెవెల్ లో ఇల్లందు వాసవి క్లబ్ అంటే అదుర్స్ అనేలా దూసుకెళ్తున్నారు. అలాంటి గొప్ప గురువు అర్వపల్లి రాధాకృష్ణను గురువారం గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఇల్లందు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మార్గదర్శిని ఉపాధ్యాయుల అందరి సమక్షంలో గురు పూజ, సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించా రు. రానున్న రోజుల్లో మరెందరినో అత్యున్నత స్థాయిలో నెలపాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ పుల్లూరు సతీష్ కుమార్, పర్మినెంట్ ప్రాజెక్ట్ ఇంచార్జ్ జొన్నల ఉపేంద్రనాథ్ గుప్తా, డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎలుగురి మధుబాబు, సైఫా రాజశేఖర్, వాసవి క్లబ్ అధ్యక్షుడు బోనగిరి రవి కిరణ్, ప్రధాన కార్యదర్శి కటకం సత్యేంద్ర కుమార్, కోశాధికారి తీర్థాల నాగరాజు, మార్గదర్శిని స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పౌర్ణమిని పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో చండీహోమం ఘనంగా నిర్వహణ



**అన్నపురెడ్డిపల్లి,జూలై 10, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి గ్రామంలో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని వైదికరీతిలో చండీహోమం నిర్వహించబడింది. ఈ ప్రత్యేక కార్యక్రమం ఉదయం నుండే భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. వేదపండితులు మంత్రోచ్చారణలతో హోమాన్ని ప్రారంభించి, పూర్ణాహుతితో ముగించారు. ఈ చండీ హోమంలో ఆలయ చైర్మన్ శ్రీ మల్లెల నరసింహారావు దంపతులు, గ్రామానికి చెందిన అనేక మంది భక్తులు పాల్గొన్నారు. హోమ సమయంలో భక్తులు నారికేళ, హవ్యగవ్యాలు సమర్పించి స్వామి వారిని ఆరాధించారు. శాంతి, సంపద, సకల శుభాల కోసం స్వామివారిని ప్రార్థించారు. పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ ప్రత్యేక చండీహోమం ఆలయ పరిసరాలను ఆధ్యాత్మికతతో నింపింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, నైవేద్యం కూడా నిర్వహించబడింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో దేవస్థానం మేనేజర్, సిబ్బంది ప్రత్యేక శ్రమ చేశారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఈ కార్యక్రమాన్ని తిలకించి ఆనందం వ్యక్తం చేశారు.

## ఆటోను ఢీకొన్న డీసీఎం : మహిళకు తీవ్ర గాయం

- అన్నపురెడ్డిపల్లి గ్రామంలో దుర్ఘటన





**అన్నపురెడ్డిపల్లి,జులై 10,ప్రజా జ్యోతి :** అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుండు మాధవి అనే మహిళ కూలీ పనులకు వెళ్లి ఆటోలో తిరిగి వస్తుండగా, జిల్లా పరిషత్ పాఠశాల దగ్గర మర్రిచెట్టు వద్ద డీసీఎం వాహనం ఢీ కొట్టిన ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆమె కాలి ఎముక విరిగిపోయింది. ఘటన సమయంలో 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో, అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తన స్టేషన్ వాహనాన్ని ఉపయోగించి మాధవిని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అత్యవసర చికిత్స నిమిత్తం తరలించడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు. పోలీసుల తక్షణ స్పందన పట్ల స్థానికులు అభినందనలు తెలిపారు.

## బెల్ట్ షాపులు నిర్వహాకులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతి




**ములకలపల్లి, జూలై 10, ప్రజా జ్యోతి:** మండల వ్యాప్తంగా విద్యాలయాల ముందు మద్యం అమ్మకాలు జరుపుతున్న బెల్టు షాపుల నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ ములకలపల్లి మండల సమితి ఆధ్వర్యం లో స్థానిక పోలీసులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అనుముల సాయి కిరణ్ మాట్లాడుతూ ములకలపల్లి మండలవ్యాప్తంగా విద్యాలయాల మందులు బెల్ట్ షాపులు ఏర్పటు చేసి మద్యం అమ్మకాలు జరపడం వల్ల విద్యార్థులు గంజయి లాంటి మత్తుపదార్ధాలకు ఆకర్షితులై, చేదువ్యసనాలకు బానిసలు మారి చదువులకు దూరం అయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలవ్యాప్తంగా ఉన్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్ హెచ్ ఓ కిన్నెర రాజశేఖర్ కు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. విద్యాల యాల ముందు మద్యం అమ్మకాలు జరుపుతున్న బెల్టుషాపుల నిర్వహకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యదర్శి ఎండి యూసఫ్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు తాండ్ర సమ్మయ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియా పై రైతులకు అవగాహన



**టేకులపల్లి,జూలై 10,ప్రజాజ్యోతి :** పత్తి, మొక్కజొన్న మునగ సాగు, ఫామాయిల్ సాగు, పంటల సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని డిసిసిబి చైర్మన్ లక్కినేని సురేందరరావు ఆధ్వర్యంలో ఏడిఏ లాల్చంద్, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్ గురువారం పత్తి, మొక్కజొన్న, మునగ సాగు, ఫామాయిల్ సాగు, పంటలపై నానో యూరియా, నానో డీఏపీల స్ప్రే చేయు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీంతో సమయం ఆదా అవుతుందని, కూలీల సమస్య తీరనుందని, ఎరువులు, పురుగుల మందులు, సమానంగా స్ప్రే చేయవచ్చనని వారు వివరించారు. నానో యూరియా, నానో డీఏపీని వివిధ పంటల 20 రోజుల దశ, పూతకు ముందుగా స్ప్రే చేయడం ద్వారా పంట ఎదుగుదల, భూసారం వల్ల మంచి దిగుబడి వస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎ ఓ అన్నపూర్ణ, ఏఈఓ శ్రావణి, పిఏసిఎస్ డైరెక్టర్ ఉదయ్, పిఏసిఎస్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు



**ఇల్లందు, జులై 10, ప్రజాజ్యోతి :** గురు పౌర్ణమి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇల్లందు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 35 సంవత్సరాలు విద్యాబోధన చేసి ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి త్వరలో పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు, ఎందరో విద్యార్థులకు ఎన్నో ప్రదేశాలలో 35 సంవత్సరాలుగా విద్యాబోధన చేసిన సింగరేణి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్, టి. సీతామహాలక్ష్మి, అకాడమిక్ ఇంచార్జ్ బి. శ్రీనివాస్ లను పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో శాలువాలతో ఘనంగా సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు బోనగిరి రవికిరణ్, ప్రధాన కార్యదర్శి కటకం సత్యేందర్, కోశాధికారి తీర్థాల నాగరాజు, వాసవి క్లబ్ పర్మినెంట్ ప్రాజెక్టు ఇంచార్జి జొన్నల ఉపేంద్రనాథ్ గుప్తా, వాసవి క్లబ్ మహిళా నాయకులు కటకం అలేఖ్య, బోనగిరి కల్పన తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్టియు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు




**భద్రాచలం ,జూలై 10,ప్రజాజ్యోతి :** భద్రాచలం ,దుమ్ముగూడెం మండలాల్లో సీనియర్ పిఆర్టియు నాయకులు శ్రీ ధనికొండ శ్రీనివాసరావు,దశమబాబు ఆధ్వర్యంలో ఘనంగా గురువారం ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు పి నర్సయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పి ఆర్ టి యు ముందుంటుందని , రాబోయే కాలంలో ప్రతి సమస్య పిఆర్టియు సంఘం ద్వారానే పరిష్కరించబడుతుందని అందరూ పిఆర్టియు బలోపేతం చేయడంలో పాల్గొనాలని పిలుపునించారు.ప్రధాన కార్యదర్శి చింతపల్లి ప్రభాకర్ రావు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు పి ఆర్ టి యు సంఘం యొక్క సభ్యత్వం తీసుకొని సంఘాన్ని బలోపేతం చేయడం ద్వారా సమస్యల సాధనలో ముందుండాలని శ్రీపాల్ రెడ్డి నాయకత్వాన్ని బలపచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ వివిధ మండల శాఖ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శిలుపాల్గొన్నారు.

## ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**భద్రాచలం, జూలై 10,ప్రజాజ్యోతి :** భద్రాచలంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కళాశాల సెంటర్లో కొలువైన శ్రీసాయిబాబా ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, అబ్బినేని శ్రీనివాసరావు, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సాయిబాబాకు అందమైన పూలతో అలంకరణ చేసి బంగారు కిరీటం, బంగారు హారాన్నిధరింపచేయగా భక్తులు బాబాను దర్శించుకుని పులకించిపోయారు. బాబాకు ప్రత్యేక అభిషేకం, కాగడ హారతి, ఇతర హారతులు అందించారు. మధ్యాహ్నం 5వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం కూడా బాబాకు సంధ్యా హారతులు, పల్లకిసేవ నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలో పలు సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి.

## సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి శోభ

- సాయిబాబా దర్శనం కోసం భారీగా ఆలయాలకు తరలిన భక్తులు

**అశ్వారావుపేట, జూలై 10, ప్రజాజ్యోతి:** నియోజకవర్గ వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వినాయకపురం సాయిబాబా ఆలయంలోనూ, అశ్వారావుపేట లోని జంగారెడ్డిగూడెం రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ జ్ఞాన సాయిబాబా మందిరంలోనూ అంగరంగ వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. ఈ క్రమంలోనే సాయిబాబా ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులు వేకువజామునుంచే సాయినాథుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా సాయినాథుడి ఆలయాల్లో సందడి నెలకొంది. ఉదయం నుంచే మంత్రోచ్ఛారణలతో ఆలయాలు మార్మోగిపోతున్నాయి. పూల పందిరిలో.. పట్టు వస్త్రాలు ధరించి.. వెండి సింహాసనం అధిష్టించిన సాయినాథుడు భక్తులకు దర్శనమిచ్చాడు. గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా.. అశ్వారావుపేట జంగారెడ్డిగూడెం రోడ్డులోని జ్ఞాన సాయిబాబా మందిరంలో బాబాను దర్శించుకునేందుకు వేకువజామునుంచే భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రీ షిరిడి సాయి సేవా సమితి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జ్ఞాన సాయిబాబా మందిరంలో మధ్యాహ్నం జరిగిన అన్నదాన కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సుమారు 5వేల మందికి పైగా పాల్గొని ప్రసాదం స్వీకరించారు.



